ఉపాధి హామీ పనులు పూర్తి చేయాలి : పీడీ అప్పారావు

సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్డీఏ పీడీ అప్పారావు

కోదాడ రూరల్, ఫిబ్రవరి 22 : గ్రామాల్లో ఉపాధిహామీ పనులను మార్చి 15లోగా పూర్తి చేయాలని డీఆర్డీఏ పీడీ అప్పారావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం కోదాడ, అనంతగిరి, చిలుకూరు మండల ఉపాధిహామి అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పౌల్ట్రీ, అజోలా గడ్డి పెంపకం, పశు కొట్టాలు వివిధ రకాల ఉపాధి ద్వారా లబ్ధిదారులకు మంజూరైన ప్రతీ పనిని పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓలు వి.వి రామ చందర్‌రావు, సుష్మ, జి.హరిసింగ్, ఏపీఓలు, ఈసీలు, టీఏలు సిబ్బంది ఉన్నారు.

గురుకుల పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

ఉపాధ్యాయులకు సూచనలు ఇస్తున్న ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు

చిలుకూరు, ఫిబ్రవరి 22 : గురుకులాల్లో 2025-26 విద్యా సంవత్సరంలో ఐదో తరగతిలో ప్రవేశాలకు నేడు నిర్వహించనున్న పరీక్షకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ప్రిన్సిపాల్ దున్నా వెంకటేశ్వర్లు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మండల పరిధిలోని గురుకుల పాఠశాలలో ఏర్పాట్లను పరిశీలించి మాట్లాడారు. 500 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానుండగా, ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఓఎంఆర్ పద్ధతిలో పరీక్ష ఉంటుందని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

కారు దగ్ధం

జాతీయ రహదారిపై దగ్ధమైన కారు

మునగాల, ఫిబ్రవరి 22 : మండల పరిధిలోని ఆకుపాముల గ్రామ శివారులో ఎన్‌హెచ్ 65పై శనివారం తెల్లవారుజామున ప్రమాదవశాత్తు కారు దగ్ధమైంది. స్థానికుల వివరాలు.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం బాపట్ల జిల్లా పిట్టలవానిపాలెం మండలం కోమలి గ్రామానికి చెందిన తమ్మ యుగేంధర్‌రెడ్డి, వరప్రసాద్ ఇద్దరు హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ జాబ్ చేస్తుంటారు. కారులో సొంతూరికి వెళ్తుండగా మార్గమధ్యంలో ఆకుపాముల వద్దకు రాగానే తెల్లవారుజామున 4:25 నిమిషాల సమయంలో కారు ఆగిపోయింది. కిందికి దిగి చూడగా ఇంజిన్‌లో నుంచి మంటలు వచ్చి ఒక్కసారిగా కారు మొత్తం దగ్ధమైనట్లు వారు తెలిపారు. ఈ ఘటనలో ఎవరికీ ఏ ప్రమాదం జరుగలేదు.

దారి దోపిడీ దొంగల అరెస్ట్

నిందితుల వివరాలు వెల్లడిస్తున్న రూరల్ సీఐ రజితారెడ్డి

కోదాడ రూరల్, ఫిబ్రవరి 22 : దారికాచి వ్యక్తిపై దాడి చేసి నగదును దోచుకున్న ముగ్గురు దొంగలను శనివారం పోలీసులు అరెస్టు చేశారు. రూరల్ సీఐ జి.రజితారెడ్డి విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను వెల్లడించారు. అనంతగిరి మండలం గోండ్రియాల గ్రామానికి చెందిన రైతు కొండ బాల పుల్లయ్య ఈనెల 18న ఖమ్మం జిల్లా నేలకొండపల్లిలో ధాన్యం అమ్మిన డబ్బు రూ.1.78లక్షలను తీసుకొని తన ఎక్స్‌ఎల్ బైక్‌పై గ్రామానికి వస్తున్నాడు. మార్గమధ్యంలో శాంతినగర్ సమీపంలోని 365ఏ జాతీయ రహదారి సర్వీస్‌రోడ్డుపై నుంచి వస్తుండగా పుల్లయ్య బైక్‌ను ఆంధ్రా రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటకు చెందిన ఉప్పల అశోక్ కుమార్, ఎస్కే నవాబ్ షరీఫ్, దేవళ్ల రాజాలు స్కూటీపై వెంబడించారు. మధ్యలో రైతును ఆపి దాడి చేసి నగదు లాక్కొని పారిపోయారు. బాధితుడు అనంతగిరి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో నిందితులను అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. సమావేశంలో సిబ్బంది వీరబాబు, ఏడుకొండలు, నర్సింహ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు నరేశ్

జి.నరేశ్

మోతె, ఫిబ్రవరి 22 : మండలంలోని రాంపురం తండాకు చెందిన గుగులోతు నరేశ్.. జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఉమ్మడి నల్గొండ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకాయల పుల్లయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22 నుంచి 26 వరకు జార్ఖండ్ రాష్ట్రంలోని రాంచీలో జరిగే సీనియర్ పురుషుల ఛాంపియన్ షిప్‌లో నరేశ్ పాల్గొననున్నట్లు ఆయన పేర్కొన్నారు.

వాలీబాల్స్ అందజేత

పాఠశాలకు వాలీబాల్ అందిస్తున్న బారి అశోక్

ఆత్మకూర్.ఎస్, ఫిబ్రవరి 22 : మండల పరిధిలోని జడ్పీహెచ్ఎస్‌కు తెలంగాణ స్టూడెంట్ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు బారీ అశోక్ కుమార్ ఆధ్వర్యంలో వాలీబాళ్లను అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, పీఈటీ బొడ్డు శ్రీనివాస్, బట్టిపల్లి వెంకన్న, బోనగిని సతీశ్, దండిగ రమేశ్, కిషన్‌నాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ ప్రైమ్ విద్యా సంస్థల ప్రకటనలు అరికట్టాలి : టీఎస్పీ

చివ్వెంల, ఫిబ్రవరి 22 : అనుమతుల్లేని ఎస్ఆర్ ప్రైమ్ విద్యా సంస్థల ప్రకటనలను విద్యాశాఖ ఉన్నతాధికారులు అరికట్టాలని టీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు బారి అశోక్ అన్నారు. సూర్యాపేట మున్సిపాలిటీ పరిధి దురాజ్‌పల్లిలోని ఎస్ఆర్ ప్రైమ్ పాఠశాల ఎదుట శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇప్పటికే కరపత్రాలు, పెద్ద ఫ్లెక్సీలతో పాఠశాల యాజమాన్యం ప్రకటనలు చేస్తున్నారని, ఇలాంటి కార్పొరేట్ విద్యా సంస్థల వల్ల పేద, మధ్యతరగతి విద్యార్థులకు చదువు భారం అవుతుందన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు కోల కర్ణాకర్, టీఎస్పీ జిల్లా అధ్యక్షుడు వర్రె అంజి, శ్రీకాంత్, గోపి ఉన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

WANTED
★Wanted Helper for Cloth Showroom in Hyderabad. Food and Staying Facility is available.
Call: 9000321282, 9849409986.
NT-09041_All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం...
మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines,
Extra Line - Extra Amount
5% GST అదనం
పూర్తి వివరాలకు :
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం, గ్రా: చర్లపల్లి, మం: నల్లగొండ.
నల్లగొండ : 9182777626 | నల్లగొండ : 9182777635 | దేవరకొండ : 9182777635
హాలియా : 9182777059 | సూర్యాపేట : 9182777630 | భువనగిరి : 9182777638
మిర్యాలగూడ : 9182777059 | కోదాడ : 9182777630 | చౌటుప్పల్ : 9182777638

మండల స్థాయిలోనే సమస్యల పరిష్కారం

- ఎస్పీ శరత్‌చంద్ర పవార్
- డిండి పోలీస్‌స్టేషన్‌లో మీట్ ది ఎస్పీ నిర్వహణ

ఫిర్యాదు దారుతో మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

డిండి, ఫిబ్రవరి 22 : మారుమూల ప్రాంతాల ప్రజల సమస్యలను మండల స్థాయిలోని పరిష్కరిస్తున్నట్లు ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో మీట్ యువర్ ఎస్పీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి ఆయన ఫిర్యాదులు స్వీకరించారు. మొత్తం 26 మంది తమ సమస్యలపై ఎస్పీకి వినతి పత్రం అందించారు. ముఖ్యంగా భూ సమస్యలు, కుటుంబ తగాదాలు, జాబ్ ఇప్పిస్తామని మోసం చేయడం, సైబర్ క్రైమ్ వంటి వాటిపై ఫిర్యాదులు రాగా ఎస్పీ వారితో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలాల్లో సుదూర ప్రాంతంలో ఉన్న బాధితులు జిల్లా కేంద్రానికి వచ్చి ఫిర్యాదు చేయడానికి వ్యయప్రయాసాలకు గురవుతున్నారని, దానికి పరిష్కార మార్గంగా ఇక నుంచి జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్లలో మీట్‌ది ఎస్పీ కార్యక్రమాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. అంతకు ముందు పోలీస్ స్టేషన్ పరిసరాలు, స్థితిగతులు, రిసెప్షన్, స్టేషన్ రైటర్, లాకప్ రూమ్, ఎస్‌హెచ్ఓ రూమ్ పరిశీలించారు. కార్యక్రమంలో దేవరకొండ ఏఎస్పీ మౌనిక, సీఐ సురేశ్, ఎస్ఐ రాజు, సిబ్బంది ఉన్నారు.

రోడ్డు ప్రమాద బాధితుడికి కూసుకుంట్ల పరామర్శ

పవన్‌ను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

మర్రిగూడ, ఫిబ్రవరి 22 : మండలంలోని వట్టిపల్లి మాజీ సర్పంచ్ ఎడ్ల శ్రీరాములు కుమారుడు పవన్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి శనివారం ఆస్పత్రికి వెళ్లి పవన్‌ను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ మెండు మోహన్‌రెడ్డి, మాల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దంటు జగదీశ్వర్, నాయకులు బచ్చు రామకృష్ణ, రామిడి వెంకటరమణారెడ్డి, ఊరిపక్క నగేశ్, చెర్కు లింగం గౌడ్ ఉన్నారు.

నాలుగు కాళ్ల కోడి పిల్ల

నాలుగు కాళ్లతో జన్మించిన కోడి పిల్ల

పెద్దవూర, ఫిబ్రవరి 22: మండలంలోని బట్టుగూడెం గ్రామానికి చెందిన లక్క వెంకట్‌రెడ్డి ఇంట్లో కోడిని పొదిగేయగా వచ్చిన పిల్లల్లో ఒక దానికి నాలుగు కాళ్లు ఉన్నాయి. వెంకట్‌రెడ్డి కోడి పది గుడ్లను పొదిగి పిల్లలను తీస్తే 9 పిల్లలు సాధారణంగానే ఉండ గా ఒక కోడి పిల్ల మాత్రమే నాలుగు కాళ్లతో జన్మించింది. ప్రస్తుతం నాలుగు కాళ్లతో మిగతా కోడిపిల్లలాగానే తల్లి కోడి వెంట తిరుగుతోంది.

మిర్యాలగూడలో హర్ష టయోటా కార్ల మేళా

మేళాలో ప్రదర్శనకు ఉంచిన హర్ష టయోటా సరికొత్త మోడల్ కార్లు

మిర్యాలగూడటౌన్, ఫిబ్రవరి 22: కార్ల దిగ్గజ కంపెనీ హర్ష టయోటా ఆధ్వర్యంలో మిర్యాలగూడ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం సమీపంలో శనివారం గ్రామీణ మహోత్సవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో కంపెనీకి చెందిన కార్లను ప్రదర్శించారు. ఈ సందర్భంగా హర్ష టయోటా ప్రతినిధి మాట్లాడుతూ వినియోగదారులకు ఉత్తమమైన టయోటా కార్లను అందుబాటులోకి తీసుకురావడానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. టయోటా కంపెనీకి చెందిన సరికొత్త మోడళ్లు హైరిడర్, గ్లాంజా, టైసర్‌తో పాటు రూమియర్ వాహనాలను ప్రదర్శనకు ఉంచినట్లు పేర్కొన్నారు. అత్యాధునిక టెక్నాలజీతో, కుటుంబ సౌలభ్యం కోసం సౌకర్యవంతంగా కార్లను రూపొందించనట్లు తెలిపారు. వీటితో పాటు వివిధ రకాలైన అధిక నాణ్యతగల పూర్వ యాజమాన్య వాహనాలను సైతం అందిస్తున్నట్లు చెప్పారు. ఈ ప్రదర్శనలో టెస్ట్ డ్రైవ్, టయోటా నిపుణులతో ఇంటరాక్టివ్ సెషన్ కూడా ఉంటాయన్నారు. ప్రతి మోడల్‌పై డీల్స్, తగ్గింపులు కూడా అందిస్తున్నట్లు చెప్పారు. ఈ వేడుకలో ప్రతిఒక్కరూ పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ

త్రిపురారం, ఫిబ్రవరి 22: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు శనివారం లయన్స్ క్లబ్ ఆఫ్ మిర్యాలగూడ భాస్కర ఆధ్వర్యంలో రూ.10వేల విలువైన పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, స్కేళ్లు, పెన్సిళ్లు అందించారు. ఈ సందర్భంగా సంస్థ చార్టెడ్ ప్రెసిడెంట్ మురహరి మాట్లాడుతూ దాత గుడిపాటి నవీన్, క్రాంతి సహకారంతో పరీక్ష సామగ్రిని విద్యార్థులకు అందించినట్లు తెలిపారు. పదో తరగతిలో 10 జీపీఏ సాధించిన వారికి రూ. 2వేలు అందిస్తానని చార్టెడ్ మెంబర్ బీఎం.నాయుడు ప్రకటించారు. ప్రధానోపాధ్యాయుడు రవికుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు యాద్గార్‌పల్లి వసతి గృహ సముదాయం ప్రారంభం

- జిల్లా రైతుబంధు సమితి మాజీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

మిర్యాలగూడ రూరల్, ఫిబ్రవరి 22 : మండలంలోని యాద్గార్‌పల్లి గ్రామంలో బ్రాహ్మణులకు వసతి గృహంతో పాటు అయ్యప్ప స్వామి మాల ధరించిన వారికి వసతి గృహ సముదాయన్ని రూ.28లక్షలతో నిర్మించినట్లు జిల్లా రైతుబంధు సమితి మాజీ చైర్మన్ చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ వసతి గృహ సముదాయ నిర్మాణానికి తన వంతుగా రూ.8లక్షలు విరాళంగా అందించగా.. దాతలు అందించిన రూ.20 లక్షలతో భవనాన్ని పూర్తి చేశామన్నారు. అందుకు సహకరించిన దాతలకు ధన్యవాదాలు తెలిపారు. ఆదివారం నిర్వహించే వసతి గృహ సముదాయ ప్రారంభోత్సవానికి దాతలు, గ్రామస్తులు తరలిరావాలని కోరారు.

ఉరేసుకొని వృద్ధుడి ఆత్మహత్య

- మహిళ దాడి చేయడంతో తీవ్ర వనస్థాపం

నిడమనూరు, ఫిబ్రవరి 22 : మహిళ తనను తిట్టి దాడి చేసిందని మనస్థాపానికి గురైన వృద్ధుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని వెంగన్నగూడెంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కుంటిగొర్లగూడెం గ్రామానికి చెందిన కుంటిగొర్ల ఎల్లయ్య(60)తో పాటు మరి కొందరు వెంగన్నగూడెం గ్రామ శివారులోని మేరెడ్డి వంశీవర్ధన్‌రెడ్డి పత్తి తోటను లీజుకు తీసుకొని గొర్రెలను మేపుతున్నారు. ఈ క్రమంలో తన కోడలిని ఎల్లయ్య లైంగికంగా వేధించాడని ఆరోపిస్తూ కుంటిగొర్లగూడెం గ్రామానికి చెందిన మహిళ శుక్రవారం రాత్రి ఎల్లయ్యను దుర్భాషలాడి దాడి చేసింది. పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ పెడతానని హెచ్చరించి వెళ్లింది. దాంతో తీవ్ర మనస్థాపానికి గురైన ఎల్లయ్య రాత్రి వెంగన్నగూడెం శివారులోని గొర్రెల దొడ్డి వద్దకు వెళ్లి అక్కడే ఉన్న వేప చెట్టుకు చీరతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. శనివారం ఉదయం గ్రామస్తులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ గోపాల్‌రావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి కుమారుడు కుంటిగొర్ల శ్రీను ఫిర్యాదు మేరకు ఎల్లయ్యను దూషించిన మహిళపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలకు బెంచీలు అందజేత

పాఠశాలకు డెస్క్ బెంచీలు అందిస్తున్న లయన్స్‌క్లబ్ బాధ్యులు

హాలియా, ఫిబ్రవరి 22 : లయన్స్‌క్లబ్ ఆఫ్ నల్లగొండ స్టార్స్ ఆధ్వర్యంలో కీసర యుగంధర్‌రెడ్డి, భారతి సహకారంతో హాలియా మున్సిపాలిటీ పరిధిలోని ఇబ్రహీంపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు శనివారం 10 డ్యూయల్ డెస్క్ బెంచీలను అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సలహాదారుడు యడవల్లి నరేందర్‌రెడ్డి, క్లబ్ డిస్ట్రిక్ 320 సెక్రెటరీ శివశంకర్‌రావు, సింహాద్రి, ట్రెజరర్ మురళీధర్‌రెడ్డి, సభ్యులు కట్ట అనంతరెడ్డి, అలుగుబెల్లి ఆదిరెడ్డి, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ నల్లబోతు వెంకటయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు బీసీ గురుకుల ప్రవేశ పరీక్ష

మిర్యాలగూడ రూరల్,ఫిబ్రవరి 22 : బీసీ గురుకుల పాఠశాలలో ప్రవేశానికి ఆదివారం నిర్వహించే పరీక్షకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండలంలోని శ్రీనివాస్‌నగర్‌లో నిర్వహిస్తున్న దామరచర్ల సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఉమాదేవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో 300 మంది విద్యార్థులు హాజరు కానునున్నట్లు పేర్కొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న కస్తూరి ఫౌండేషన్ చైర్మన్ కస్తూరి చరణ్

చిట్యాల, ఫిబ్రవరి 22 : మండలంలోని చిన్నకాపర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు శనివారం కస్తూరి ఫౌండేషన్ చైర్మన్ కస్తూరి చరణ్ స్టడీ మెటీరియల్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరా రు. ఎంఈఓ పానుగోతు సైదానాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కస్తూర్బా పాఠశాలలో..

చండూరు : మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల పదో తరగతి విద్యార్థులకు శనివారం పీఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్ అందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ చెల్లం పాండురంగారావు, పాఠశాల ఎస్ఓ మంజుల, సివిల్ ఇంజినీర్ భూతరాజు ధనలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సుద్దబాయితండా వాసికి డాక్టరేట్

పీహెచ్‌డి పట్టా అందుకున్న అనితనాయక్

చందంపేట(నేరేడుగొమ్ము), ఫిబ్రవరి 22 : నేరేడుగొమ్ము మండలంలోని సుద్దబాయితండాకు చెందిన కేతావత్ అనితానాయక్ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. ఆమె ప్రస్తుతం సోషల్ వెల్ఫేర్ గురుకుల డిగ్రీ కళాశాలలో అధ్యాపకురాలిగా పని చేస్తున్నారు. ఉస్మానియా యూనివర్సిటీ 'ఇంప్యూరిటీ ప్రొఫైలింగ్ అండ్ స్టెబిలిటీ ఇండికేటింగ్ మెథడ్ డెవలప్‌మెంట్ అండ్ వాలిడేషన్ ఆఫ్ సెలక్టెడ్ డ్రగ్స్' అంశంపై ఆమె చేసిన పరిశోధనకు ఉస్మానియా యూనివర్సిటీ పీహెచ్‌డీ పట్టా అందించింది. అనితానాయక్ పీహెచ్‌డీ పట్టా అందుకోవడంతో భర్త మకట్‌లాల్, తండా వాసులు హర్షం వ్యక్తం చేశారు.

పోలింగ్ కేంద్రాన్ని ఆర్డీఓ పరిశీలన

మునగాల : పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ సూర్యనారాయణ

మునగాల, ఫిబ్రవరి 22 : మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో ఈనెల 27న జరుగబోయే ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని శనివారం ఆర్డీఓ సూర్యనారాయణ పరిశీలించారు. ఆయన వెంట తాసీల్దార్ ఆంజనేయులు ఉన్నారు.

మఠంపల్లి : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని తాసీల్దార్ మంగా రాథోడ్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంఆర్‌సీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాన్ని శనివారం ఆమె సందర్శించి మాట్లాడారు.

మద్దిరాల : మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని తాసీల్దార్ అమీన్‌సింగ్ పరిశీలించారు.

మాట్లాడుతున్న మోడల్ స్కూల్ రాష్ట్ర డిప్యూటీ డైరెక్టర్ దుర్గాప్రసాద్

ఉత్తమ ఫలితాల సాధనలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

- మోడల్ స్కూల్ రాష్ట్ర డిప్యూటీ డైరెక్టర్ దుర్గాప్రసాద్

పెన్‌పహాడ్, ఫిబ్రవరి 22 : విద్యార్థులు ఉత్తమ ఫలితాల సాధనలో ఆదర్శ పాఠశాలల ఉపాధ్యాయులు పటిష్టంగా పని చేయడం హర్షణీయమని మోడల్ స్కూల్ రాష్ట్ర డిప్యూటీ డైరెక్టర్ దుర్గాప్రసాద్ అన్నారు. మండల పరిధిలోని అనాజిపురం మోడల్ స్కూల్‌లో శనివారం నిర్వహించిన 12వ వార్షికోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించినప్పుడు తల్లిదండ్రుల జన్మ సార్ధకమవుతుందన్నారు. ఉపాధ్యాయుల బోధన, విద్యార్థులు సరైన రీతిలో అర్థం చేసుకున్నప్పుడే మంచి ఫలితాలు సాధించేందుకు అస్కారం ఉంటుందన్నారు. పదో తరగతి, ఇంటర్ విద్యార్థులు పట్టుదలతో చదివి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని కోరారు.

వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, క్రీడల్లో గెలుపొందిన, ర్యాంకులు సాధించిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి డి.వస్రాంనాయక్, ప్రిన్సిపాల్ కోడి లింగయ్య, ఇమాంపేట, గడ్డిపల్లి మోడల్ స్కూళ్ల ప్రిన్సిపాల్స్ లక్ష్మీ ప్రసన్న, బి.రమేశ్, వైస్ ప్రిన్సిపాల్ కె.గురుచరణ్, ఉపాధ్యాయులు సంపత్‌కుమార్, వెంకన్న, గుర్రాల సోమయ్య, క్రాంతికుమార్, వాసు, వీరారెడ్డి, రాజయ్య, లక్ష్మీ నారాయణ ఉన్నారు.

నీటి ఎద్దడిని నివారించాలి : సీపీఐ

మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కమిటీ సభ్యుడు ధనుంజయనాయుడు

నేరేడుచర్ల, ఫిబ్రవరి 22 : వేసవి వస్తున్నందున గ్రామాల్లో తాగు నీటి ఎద్దడి లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలని సీపీఐ జిల్లా కమిటీ సభ్యుడు ధూళిపాళ ధనుంజయనాయుడు కోరారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన హాజరై మాట్లాడారు. బోర్లు, చేతి పంపులు, మోటార్లు, సింగిల్ ఫేస్ మోటార్లలో ఇబ్బందులుంటే మరమ్మతులు చేయించాలని కోరారు. సమావేశంలో సీపీఐ మండల, పట్టణ కార్యదర్శులు ఎల్లబోయిన సింహాద్రి, కత్తి శ్రీనివాస్‌రెడ్డి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను, ఏఐఎస్ఎఫ్ నాయకుడు కొమ్మరాజు వెంకట్ ఉన్నారు.

అంతర్జాతీయ కవలల దినోత్సవం

విద్యార్థులకు పరీక్ష సామగ్రిని పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

కోదాడటౌన్, ఫిబ్రవరి 22 : పట్టణంలోని కట్ట సాయి భవానీ మెమోరియల్ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో కవలల దినోత్సవం సందర్భంగా ఆ అసోసియేషన్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థినులకు శనివారం పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు చలిగంటి రామారావు, కొల్లూరి శ్రీనివాస్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ స్వరూప, రాణి పాల్గొన్నారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాలి : నారాయణ

నూతనకల్, ఫిబ్రవరి 22 : కులగణన ఆధారంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ అసెంబ్లీలో వెంటనే బిల్లు పెట్టాలని చేనేత కార్మిక సంఘం జిల్లా నాయకుడు చిదిరాల నారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు రిజర్వేషన్ కల్పిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రంపై ఒత్తిడి తెస్తామని చెప్పడంతో ఉపయోగం లేదన్నారు. చట్టం చేయడం ద్వారానే బీసీలకు న్యాయం జరుగుతుందన్నారు. సమావేశంలో నాయకులు వీరన్న, సోమనర్సు, వెంకటేశ్, రామ్మూర్తి, అవిలయ్య ఉన్నారు.

పేద రైతులకు రూ.12 వేలు ఇవ్వాలి : ప్రభాకర్ గౌడ్

నూతనకల్, ఫిబ్రవరి 22 : భూమి లేని ప్రతి పేద రైతుకు రూ.12 వేలు ఇవ్వాలని సీపీఐ మండల కార్యదర్శి తొట్ల ప్రభాకర్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉపాధి హామి జాబ్ కార్డు కలిగిన కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద రూ.12 వేలు ఇస్తానన్న ప్రభుత్వం, ఆ ప్రతిపాదనను విరమించుకుని భూమి లేని పేద రైతులకు రూ.12 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. నాయకులు సోమలింగం, చంద్రమౌళి, నారాయణ, శ్రీనువాస్, రమేశ్ ఉన్నారు.

వాటర్ ప్లాంట్ ఏర్పాటు

నీటి శుద్ధి యంత్రాలను ప్రారంభిస్తున్న నాగమల్లేశ్వర్‌రావు

పాలకవీడు, ఫిబ్రవరి 22 : మండలంలోని భవానీపురం గ్రామంలో గల దక్కన్ ఫ్యాక్టరీ ఆధ్వర్యంలో శనివారం కొత్తతండా గ్రామంలో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసినట్లు సంస్థ సీజీఎం నాగమల్లేశ్వర్‌రావు తెలిపారు. రూ.7లక్షలతో ఈ నీటి శుద్ధి యంత్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు దక్కన్ యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు.

మోతె : రావికుంట తండా ప్రాథమిక పాఠశాలలో..


తుంగతుర్తి : వెలుగుపల్లి ప్రాథమిక పాఠశాలలో..

స్వపరిపాలన దినోత్సవం

మోతె, ఫిబ్రవరి 22 : మండలంలోని రావికుంట తండా ప్రాథమిక పాఠశాలలో శనివారం స్వపరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు బోధించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సీహెచ్ సింహాద్రి, కె. సైదులు, ఎస్ఎంసీ చైర్మన్ శోభ, విద్యార్థులు పాల్గొన్నారు.

తుంగతుర్తి : మండల పరిధిలోని వెలుగుపల్లి ప్రాథమిక పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవం నిర్వహించారు. హెచ్ఎం చంద్రశేఖర్, ఉపాధ్యాయులు వెంకట్‌రెడ్డి, మిర్యాల మధు, సురేశ్, లలిత పాల్గొన్నారు.